# కొత్త చరిత్ర

## సమసిపోయిన పోడు సమస్య

- జిల్లాలో 50,595 మందికి అందిన పోడు పట్టాలు
- 1,51,195 ఎకరాల భూమి రైతులకు పంపిణీ
- చరిత్ర సృష్టించిన తెలంగాణ ప్రభుత్వం
- గిరిజన రైతుల కన్నీళ్లు తుడిచిన సీఎం కేసీఆర్
- ఆనందంగా సాగు చేసుకుంటున్న పోడు రైతులు



టేకులపల్లిలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్ (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం (నమస్తే తెలంగాణ)/సారపాక/ ఇల్లెందు, అక్టోబర్ 25 : అడవిని నమ్ముకొని జీవిస్తున్న రైతన్నల ఇంట ఆనందం వెల్లివిరుస్తున్నది. ఎంతోకాలంగా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడంతో వారి సంతోషానికి హద్దులేకుండా పోయింది. ఎన్నో సమస్యలను అధిగమించిన గిరిజన రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిచి వారి సమస్యకు చరమగీతం పాడి పూర్తిగా విముక్తి కల్పించారు. ఒకరుకాదు ఇద్దరుకాదు ఏకంగా 50 వేల మందికిపైగా గిరిజన రైతులకు పోడుపట్టాలు పంపిణీ చేశారు. గత జూన్‌లో ఈ చరిత్రాత్మక ఘట్టానికి తెలంగాణ ప్రభుత్వం అంకురార్పణ చేసింది.

### చరిత్రలో తొలిసారి..

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నామమాత్రంగా పోడుపట్టాలు ఇచ్చి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. నాటి నుంచి నేటివరకు గిరిజనులకు ఎలాంటి పోడు పట్టాలు ఇవ్వకపోవడంతో మన్యం పోడు సమస్యతో అతలాకుతలమైంది. ఎంతోమంది గిరిజనులు విల్లంబులు చేతబట్టి అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కేసుల్లో కూడా ఇరుక్కున్నారు. ప్రజాప్రతినిధులు గిరిజనులపక్షాన ఉన్నా అప్పటి అధికారులు, ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. 2008 నుంచి 2012 వరకు అప్పటి ప్రభుత్వం కేవలం 24వేల మందికి మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుంది. తెలంగాణ వచ్చాక ఇంత పెద్ద మొత్తంలో పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం ఇదే తొలిసారి. చిక్కుముడిగా ఉన్న పోడు సమస్యకు సీఎం కేసీఆర్ చక్కటి పరిష్కారం చూపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595 మంది పోడు రైతులకు 1,51,195 ఎకరాల భూమిని పంపిణీ చేశారు.

### ఇదీ జిల్లా పోడు ముఖచిత్రం

అత్యధికంగా అటవీ ప్రాంతం ఉన్న భద్రాద్రిలో 726 హ్యాబిటేషన్ పరిధిలో 332 గ్రామ పంచాయతీలు. అందులో 21 మండలాల్లో రైతులు పోడు సాగు చేస్తున్నారు. ఇందులో గిరిజనులు 65,616 మంది 2,41,107 ఎకరాల్లో పోడు సాగు చేస్తున్నారు. ఇతరులు 17,725 మంది 58,161 ఎకరాల్లో పోడు సాగు చేస్తున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఫారెస్టు కమిటీ సర్వే చేసి కచ్చితంగా పోడు సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి అర్హుల జాబితాను సిద్ధం చేసి పట్టాలు ఇచ్చింది.



### ‘రైతుబంధు’ అందజేత

పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు తెలంగాణ సర్కారు పంట పెట్టుబడి సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. దీంతోపాటు గత ఐదేళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా రైతుబంధు అందజేసింది. కొత్తగా పోడు పట్టాలు అందుకున్న రైతులకు కూడా వానకాలం పంటకు రైతుబంధు సొమ్ము వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో గిరిజన రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఒకవైపు రైతులన్నీ అన్నివిధాలా ఆదుకుంటూనే అడవిని కాపాడుకునేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. భవిష్యత్‌లో అటవీ భూముల జోలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు గిరిజనులు సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చారు. గిరిజన సంఘాల నాయకులు కూడా దీనికి పూర్తిస్థాయిలో మద్దతు తెలిపారు. దీంతో జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో పోడుపట్టాలు ఇవ్వడం ఇదే తొలిసారి అని చెబుతున్నారు.



ఆనందంలో పోడు పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు.(ఫైల్)

### గిరిజన పక్షపాతి సీఎం కేసీఆర్



నాలుగు దశాబ్దాలుగా ఇబ్బందులు పడ్డ గిరిజనుల పోడు భూములకు పట్టాలిచ్చి సీఎం కేసీఆర్ ఆదుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గంలో గిరిజన రైతులు పట్టాలు అందుకున్నారు. నాకు తెలిసి దేశంలో ఎక్కడా ఇంతపెద్ద ఎత్తున అటవీ భూమిపై హక్కులు కల్పించలేదు. గిరిజన పక్షపాతి సీఎం కేసీఆర్. అందుకే దశాబ్దాల పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మనల్ని ఆదుకున్న సీఎం కేసీఆర్‌ను రానున్న రోజుల్లో ఆశీర్వదించాలి.

**– బానోతు హరిప్రియ, ఎమ్మెల్యే, ఇల్లెందు**

### పోడు పట్టాలతో 10 రకాల లాభాలు

1. పోడు పట్టా వచ్చిన వెంటనే ధరణిలో పేరు నమోదై చేతికి పాస్‌బుక్ వచ్చింది. ఆ భూమికి యజమానిగా మారాడు.
2. బ్యాంకులో నేరుగా రైతుబంధు డబ్బులు జమ అయ్యాయి.
3. దురదృష్టవశాత్తు పోడు రైతు చనిపోతే రూ.5 లక్షల రైతుబీమా వర్తింపు.
4. అటవీ శాఖ అధికారుల వేధింపులుండవు. గతంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తారు.
5. తండ్రి నుంచి కొడుకుకు, భర్త నుంచి భార్యకు ఇలా తరతరాలుగా వారసత్వ హక్కు.
6. దరఖాస్తు చేసుకుంటే ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు.
7. ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చే స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువుల వంటి ప్రయోజనాలు పొందవచ్చు.
8. అకాల వర్షాల వల్ల పంట నష్టం జరిగితే పరిహారం పొందవచ్చు.
9. వ్యవసాయ మార్కెట్ కమిటీ, కోఆపరేటివ్ సొసైటీల్లో పదవులకు అర్హులు.
10. వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగకుండా బ్యాంకుల్లో పంట రుణానికి అర్హులు.

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



పోడు సాగు చేసుకుంటున్న మాకు సీఎం కేసీఆర్ పట్టాలిచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపారు. గతంలో నిత్యం పోలీసు, అటవీ అధికారుల కేసులు ఎదుర్కొనేవాళ్లం. ఆ భూములపై హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వడంతో సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. మళ్లీ ఆయన పాలనే రావాలని కోరుకుంటున్నాం.

**– పొడియం వెంకటేశ్వర్లు, పోడు రైతు, లక్ష్మీపురం, బూర్గంపహాడ్ మండలం**

### సీఎం కేసీఆర్‌ను మరువం



30 ఏళ్ల క్రితం నుంచి 4.03 ఎకరాల్లో పోడు వ్యవసాయం చేసుకున్నాను. ఆ భూమిని కాపాడుకోవడం కోసం ఎన్నో ఏళ్లుగా మా కుటుంబమంతా పోరాటం చేసింది. ఇటీవల సీఎం కేసీఆర్ ఆ భూమికి హక్కుపత్రం కల్పించడంతో మా కుటుంబంలో సంతోషం నెలకొన్నది. నా జీవితాంతం సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. ఆయనను ఎప్పటికీ మరువను.

**– సున్నం ముత్తమ్మ, పూసుకుంట, దమ్మపేట మండలం**

### పట్టాతో జన్మ ధన్యమైంది



సీఎం కేసీఆర్ హయాంలో పోడు పట్టా రావడంతో నా జన్మ ధన్యమైంది. పోడు వ్యవసాయం చేసే రైతుల సమస్యలను గుర్తించిన సీఎం కేసీఆర్ పట్టాలు అందించడంతో ఇప్పుడు అటవీ అధికారులతో ఆ గోస తప్పింది. మాపై పెట్టిన కేసులను కూడా సీఎం కేసీఆర్ తొలగించారు. పోడు రైతుగా నిజమైన రైతులతో కలిసి వ్యవసాయం చేసే అదృష్టం మాకు దక్కింది. రైతుబంధు కూడా ఇవ్వడం ఆనందాన్ని కలిగించింది.

**– పాయం సీతమ్మ, పోడు రైతు, దబ్బనూతల కొత్తూరు, దుమ్ముగూడెం మండలం**

### పట్టాతో యజమాని అయ్యా



తెలంగాణ ప్రభుత్వంలో పోడు చేసుకుంటున్న మాకు పట్టాలు అందించడంతో పోడు భూమికి నేను యజమాని అయ్యాను. ఇది వరకు అటవీ శాఖ అధికారులతో గోసపడ్డాం. ఎన్నో గొడవలు పడ్డాం. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మా బాధలను గుర్తించి పోడు భూములకు పట్టాలు అందించారు. వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

**– కొమరం నారాయణమ్మ, జిన్నెలగూడెం, ఆళ్లపల్లి మండలం**

### పట్టా వస్తదనుకోలేదు



నేను 35 ఏళ్ల క్రితం పోడు కొట్టాను. గతంలో ఆ భూమికి పట్టా కోసం దరఖాస్తు ఎన్నోసార్లు పెట్టుకున్నా. ఏళ్లు గడిచినా పట్టా రాలేదు. నేను బతికుండగా పట్టా వస్తుందనుకోలేదు. సీఎం కేసీఆర్, విప్ రేగా కాంతారావులు దేవుడిలా వచ్చి పట్టా వచ్చేలా చేశారు. నాకు 6.7 ఎకరాల పోడు భూమికి పట్టా వచ్చింది. సంతోషంగా పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా.

**– మడకం జోగయ్య, అనంతోగు, ఆళ్లపల్లి మండలం**

### మా కోరిక నెరవేరింది



పోడు నరికిన కష్టం ఊరికే పోదు. ఎప్పటికైనా మా కోసం ఆలోచించే నాయకుడు ఉంటాడని అనుకున్నాం. అదే విధంగా మా కోరిక నెరవేరింది. సీఎం కేసీఆర్ సారు మాపై దయతో పట్టాలు అందించారు. రైతుబంధు కూడా వచ్చింది. మాకు చాలా సంతోషంగా ఉంది. సీఎం సారు కాళ్లు మొక్కుతాం.

**– సర్పా సీతమ్మ, మహిళా రైతు, మద్రాస్‌తండా, టేకులపపల్లి మండలం**

### కష్టాలను గుర్తించిన దేవుడు కేసీఆర్



పోడు భూములకు పట్టాలు లేక ఎన్నో ఏళ్లుగా రందిపడ్డాం. ఎంతో మందికి మొరపెట్టుకున్నాం. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ పోడు రైతుల కష్టాలను గుర్తించి పట్టాలు అందించి పోడు రైతులకు దేవుడయ్యారు. అటవీ అధికారులు, సిబ్బందితో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. పోడు భూమికి యజమానిగా మారాం. పోడు రైతులకు రైతుబంధు కూడా వర్తింపజేయడం ఆనందాన్నిచ్చింది. సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

**– వంకా పంతులు, పోడు రైతు, తుమ్మలచెరువు, అశ్వాపురం మండలం**

### మా పాలిట సీఎం కేసీఆర్ దేవుడు



ఏళ్ల తరబడి సాగు చేసినా పట్టాలు రావనుకున్నాం. భూమి విషయంలో ఎన్నోసార్లు అధికారులతో గొడవలు పడ్డాం. మా అయ్యలపై కేసులు కూడా పెట్టారు. అడవికి వెళితే అటవీ శాఖ అధికారులు బెదిరించేటోళ్లు. ఏళ్లపాటు చాలా కష్టాలు పడ్డాం. ఇంతకాలానికి పట్టాలు రావడంతో అందరు రైతులతో సమానంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. నిజంగా మా పాలిట సీఎం కేసీఆర్ సారు దేవుడు.

**– బుర్ర లక్ష్మి, మహిళా రైతు, బొజ్జలగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలం**

### సత్తా కలిగిన సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్ నిజంగా మొనగాడే. పోడు భూముల విషయంలో ఎన్ని గొడవలు జరిగినా మేము భూములను వదల్లేదు. ఇన్నేళ్లకు సీఎం కేసీఆర్ మాపై కనికరం చూపి పోడు భూములకు పట్టాలు ఇవ్వడం ఎప్పటికీ మరిచిపోలేం. గిరిజనులమంతా తెలంగాణ వైపే ఉంటాం. వచ్చే ఎన్నికల్లో మేమంతా సీఎం కేసీఆర్ వైపే.

**– ఈసం చిననర్సయ్య, పోడు రైతు, నరసాపురం, గుండాల మండలం**

### మా జీవితానికి ఇదే పెద్ద వరం



మా జీవితాలకు ఇదే పెద్ద వరం. దేవుడు వరం ఇచ్చినట్లు చేతికి పట్టాలు అందాయి. ఎన్నో ఏళ్ల సమస్య బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పరిష్కారమైంది. తెలంగాణ రావడం వల్లే మాకు పట్టాలు వచ్చాయనుకుంటున్నాం. పట్టాలు తీసుకున్న తర్వాత మా గూడేల్లో పండుగ చేసుకున్నాం. పోడు భూముల్లో పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

**– శర్పా రమేశ్, పోడు రైతు, మద్రాస్‌తండా, టేకులపల్లి మండలం**

### గిరిజనులను ఆదుకున్న దేవుడు



అడవిలో వ్యవసాయం చేయొద్దని అధికారులు అనేక రకాల ఇబ్బందులకు గురిచేశారు. వర్షాకాలంలో అటవీ శాఖ అధికారులతో రోజూ గొడవలు జరిగేవి. కానీ.. సీఎం కేసీఆర్ నాకున్న మూడెకరాల పోడు భూమికి పట్టాలు అందించి ఆదుకున్నారు. రైతుబంధు డబ్బులు కూడా జమ అయ్యాయి. గిరిజనులను ఆదుకున్న దేవుడు కేసీఆర్‌ను ఎప్పటికీ మరచిపోలేం.

**– అజ్మీర సుశీల, మహిళా రైతు, కొమరారం, ఇల్లెందు మండలం**

### బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరువం



గత ప్రభుత్వంలో మమ్ములను అనేక ఇబ్బందులకు గురి చేశారు. భూమిని నమ్ముకొని బతుకుతున్న మాపై అనేక దాడులు చేశారు. అటవీ, పోలీసు అధికారులు నిత్యం వేధింపులకు గురిచేశారు. భూమి నుంచి వెళ్లగొట్టి కేసులు పెట్టి జైళ్లకు పంపారు. అడవులు తరిగిపోవడానికి నాటి ప్రభుత్వాలు కారణమైనప్పటికీ మమ్ములను దోషులుగా నిలబెట్టారు. ఇచ్చిన మాట ప్రకారం నాకున్న ఐదెకరాలకు సీఎం కేసీఆర్ సార్ పట్టా ఇచ్చారు. ఇప్పుడు అధికారుల వేధింపులు, బెదిరింపులు లేవు. ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. కేసీఆర్ సార్‌కు రానున్న రోజుల్లో అండగా ఉంటాం.

**– సికింద్రా, పోడు రైతు, సీతానగరం, ఇల్లెందు మండలం**

# ప్రజలే నా కుటుంబ సభ్యులు

- వారి కోసమే పనిచేస్తున్నా.. ప్రజల నుంచి నేనేమీ ఆశించలేదు..
- ‘తుమ్మల’ నన్ను రజాకార్‌తో పోల్చడం హాస్యాస్పదం
- పోలీసులు, అధికారులపై తుమ్మలవి అనుచిత వ్యాఖ్యలు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఖమ్మం నగరంలో ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం, అక్టోబర్ 25: ‘ప్రజలే నా కుటుంబ సభ్యులు.. నా అన్నదమ్ముళ్లు.. అక్కాచెల్లెళ్లు.. వారి కోసం వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ నిజాయితీగా పని చేస్తున్నా.. వారి నుంచి నేనేమీ ఆశించలేదు. వారి సంక్షేమం కోసం మున్ముందు మరింత పనిచేస్తా..’ అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలో బుధవారం న్యాయవాది మల్లాది వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి.. అహంకారానికి మధ్య పోటీ జరుగుతున్నదన్నారు. కేవలం రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాను అధికారులు, చిరుద్యోగులతో సైతం మర్యాదగా నడుచుకుంటున్నానన్నారు. ఇప్పటివరకు ఎవరినీ తులనాడలేదని స్పష్టం చేశారు. ‘కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పోలీసులను జీపుల ముందు పరిగెత్తిస్తాం..’ అని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అహంకార పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. తుమ్మల తనను రజాకార్ ఖాసీం రజ్వీతో పోల్చడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే బీఆర్‌ఎస్ అధిష్ఠానం తుమ్మలను పిలిచి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేసిందన్నారు. బై ఎలక్షన్‌లో టికెట్ ఇచ్చి గెలిపించిందని గుర్తుచేశారు. నాడు దర్జాగా పదవులు అనుభవించి నేడు నిస్సిగ్గుగా బీఆర్‌ఎస్‌పై అవాకులు చెవాకులు పేలడం తుమ్మలకే చెల్లిందన్నారు. పాలేరు టికెట్ ఇవ్వనందుకే బీఆర్‌ఎస్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. గోదావరి జలాలు తీసుకొచ్చి ప్రజల కాళ్లు కడుగుతానని చెప్పిన తుమ్మల ఆ పనిలో నిమగ్నం కాకుండా, ఇప్పుడు ప్రజల కాళ్ల చెంతకు వెళ్లి ఓట్లు అభ్యర్థించే పని ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, నాయకులు వెంకట్‌రెడ్డి, ముత్తయ్య, హరిబాబు, కొండల్‌రావు, మేకల భిక్షమయ్య, వేములపల్లి వెంకటేశ్వరరావు, తవిడిశెట్టి హనుమంతరావు, పోట్ల శ్రీకాంత్, వల్లభనేని రామారావు, పగడాల నాగరాజు, కొండపల్లి శ్రీనివాస్, మాటూరి లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ధర్మారావు, తాటిబండ రఘునందన్, కోటేశ్వరరావు, పాలడుగు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రం తెలుసుకోండిలా..

## ‘ఓటరు సహాయమిత్ర’తో వివరాలు




ఓటరు సహాయమిత్ర యాప్

సారపాక, అక్టోబర్ 25 : శాసనసభ ఎన్నికలు నవంబర్ 30న జరగనున్న దృష్ట్యా తాము ఓటు వేయాల్సిన పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ‘ఓటరు సహాయమిత్ర’ను వినియోగించుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉన్న ఈ యాప్‌తోపాటు ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా వివరాలు తెలుసుకునే అవకాశం ఉన్నది. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ముందే ఓటర్లు తాము ఓటు వేయాల్సిన బూత్ ఎక్కడుందో సమగ్రంగా తెలుసుకోవాలి. ఈసారి కుటుంబాలవారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గతంలో మాదిరి కాకుండా కుటుంబంలో ఓటు హక్కు ఉన్న వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్ల పోలింగ్ స్టేషన్లు మారనున్న దృష్ట్యా ముందుగానే వివరాలు తెలుసుకోవడం వల్ల ఇబ్బందులు తప్పనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. నవంబర్ 10వ తేదీలోగా నామినేషన్ల పర్వం ముగియనున్నందున ఆ తర్వాత ఓటర్లకు పోలింగ్ స్లిప్‌లు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి సమస్యలకు ఆస్కారం లేకుండా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించే విధంగా 20 రోజుల ముందుగానే పోలింగ్ స్లిప్‌లు పంపిణీ చేయాలని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించినట్లు జిల్లా యంత్రాంగం పేర్కొంది. ఈసారి నిర్దిష్ట సమయంలో 100 శాతం పోలింగ్ పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. ఓటరు సహాయమిత్ర ద్వారా వివరాలు తెలుసుకోవాలంటే http://ceotelangana.nic. in వెబ్‌సైట్‌లో ఓటర్లు సంప్రదించాలి.

# పరాయోళ్ల పాలన అవసరం లేదు

- బీఆర్‌ఎస్ అంటే.. మన ఇంటి పార్టీ
- ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో వందలాది మంది చేరిక

ఖమ్మం రూరల్, అక్టోబర్ 25 : పాలేరును పాలించుకునే దమ్ము, సత్తా ఇక్కడి ప్రజలకు ఉన్నదని, పరాయి వాళ్ల పాలన పాలేరు నియోజకవర్గ ప్రజలకు అవసరం లేదని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొలిశెట్టిగూడెంలో.. తీర్థాల, పొలిశెట్టిగూడెం, మద్దివారిగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వందలాది మంది ఎమ్మెల్యే కందాళ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మూడు గ్రామాల పార్టీ బాధ్యులు, నూతనంగా పార్టీలో చేరిన వారినుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. పాలేరు అంటే నాకు ఆశ, శ్వాస అని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు పాలేరు రెండో ప్రాధాన్యత అని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను బేధాభిప్రాయాలు లేకుండా ఇంటింటికీ అందించామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి గెలిపించుకునేందుకు గ్రామాల్లో విశేష స్పందన కనిపిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరింతగా కష్టపడి పని చేసి తనను గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, సుడా డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి, తీర్థాల సర్పంచ్ బాలునాయక్, ఏదులాపురం సొసైటీ మాజీ చైర్మన్ ధర్మారెడ్డి, ప్రస్తుత చైర్మన్ లక్ష్మణ్‌నాయక్‌తోపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ, బూత్ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కందాళ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, హాజరైన కార్యకర్తలు

### కందాళకు అభిమాని నామినేషన్ ఫీజు వితరణ

పొలిశెట్టిగూడెంకు చెందిన పెంటాల కోటయ్య కందాళ అభిమాని. అయితే మరికొద్ది రోజుల్లో ఎమ్మెల్యే కందాళ నామినేషన్ వేయనున్నందున తనవంతుగా కోటయ్య నామినేషన్ ఫీజు రూ.10,116ను అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరికి ఏ ఆపద వచ్చినా నేను సాయం చేస్తాను. కానీ.. అభిమాని నాకు సాయం చేయడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

**- బయ్యారం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హరిప్రియానాయక్**



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్

బయ్యారం అక్టోబర్ 25: బీఆర్‌ఎస్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యమని బీఆర్‌ఎస్ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియానాయక్ అన్నారు. బుధవారం ఆమె మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల పరిధిలోని కాచనపల్లి, నామాలపాడు, కొత్తపేట, సింగారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గడిచిన ఐదేండ్లలో రూ.1,800 కోట్లతో ఇల్లెందు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఇల్లెందు ప్రజల చిరకాల స్వప్నమైన బస్సు డిపోను సాకారం చేశామన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేసేది బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. ప్రజలు మారో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టాలన్నారు. 1న ఇల్లెందులో జరుగనున్న సీఎం ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్‌పర్సన్ బిందుకు గ్రామగ్రామాన ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తాతా గణేష్ , గంగుల సత్యనారాయణ, బానోతు మురళీకృష్ణ, రేఖ ఉప్పలయ్య, సంకు సత్తిరెడ్డి, ఏనుగుల ఐలయ్య, బానోతు శ్రీను నాయక్, మమత, కోటి, ఉపేంద్ర, భద్రయ్య, లక్ష్మణ్‌నాయక్, ఆర్వీ కృష్ణ, వెంకటపతి, సైదులు, రాము, రాజేశ్, రవి ఉన్నారు.



బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్మన్ బిందు